# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- ❖ విశాఖపట్టణంలో పీసా మహోత్సవ్ అట్టహాసంగా ప్రారంభమైంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.
- ❖ భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ విశాఖపట్టణం వేదికగా మరికాసేపట్లో ప్రారంభం కానుంది.

=================

యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఈరోజు సమావేశమయ్యారు. డిజిటల్ పద్దతుల ద్వారా విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను ఐఐటీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా తయారు చేసిన కార్యాచరణను ఐఐటీ ప్రతినిధులు చంద్రబాబు నాయుడుకి సమర్పించారు. దీనిపై సమీక్షించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్ గా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. 7, 8, 9 తరగతుల చదివే విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని, ఇందుకోసం పాఠశాలల్లో దశల వారీగా కంప్యూటర్ ల్యాబ్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 2026 జనవరి నెలాఖరులోగా క్వాంటం టెక్నాలజీలో నైపుణ్యాలు కల్పించేలా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

=================

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో పోలీసుల ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణ రెడ్డిలతో కలిసి పాల్గొన్న హోం మంత్రి పోలీసులకు బ్రీత్ అనలైజర్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని వాహనదారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి తిరుపతికి ఎంతోమంది భక్తులు సొంత వాహనాల ద్వారా వస్తుంటారని.. అలాంటి వారు తప్పనిసరిగా విశ్రాంతి తీసుకున్న తరువాతనే గమ్యస్థానాలకు బయలుదేరాలన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని మంత్రి అనిత పేర్కొంటూ…

(వాయిస్ 27 సెకన్లు)

=================

విశాఖపట్టణంలోని పోర్టు స్టేడియం వేదికగా పీసా మహోత్సవ్ అట్టహాసంగా ఈరోజు ప్రారంభమైంది. పీసా చట్టం పరిధిలోని రాష్ట్రాల నుండి 1500 మందికి పైగా గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, క్రీడాకారులు ఈ మహోత్సవంలో పాల్గొంటున్నారు. గిరిజనుల సాంస్కృతిక వారసత్వాన్ని, ప్రతిభను వెలికితీసేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ, విలు విద్య పోటీలను నిర్వహిస్తున్నారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, అర్జున అవార్డు గ్రహీత విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ, పలువురు ఉన్నతాధికారులు, క్రీడాకారులు ఈ పీసా మహోత్సవ్ ప్రారంభ వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. గిరిజన సంస్కృతి, సాంప్రదాయక వంటకాలు ప్రపంచానికి చాటి చెప్పేలా స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన స్టాల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

విరామం

=================

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం ద్వారాగ్రామాల్లో ఉపాధి హామీ పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడంపై శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఉపాధి శ్రామికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పుట్టపర్తి మండలం కోవెలగుట్టపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు విజయ్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ.. ఈ పథకంతో ఎటువంటి నైపుణ్యం అవసరం లేకుండా స్వగ్రామంలోనే పని దొరుకుతోందని, తాము చేస్తున్న పనులు తమకు ఉపాధి ఇస్తూనే... గ్రామానికి కూడా ఉపయోగపడుతున్నాయన్నారు. 125 రోజులు పని దినాలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

(వాయిస్ 19 సెకన్లు)

=================

పశ్చిమగోదావరి జిల్లాలో రబీ సీజనుకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. భీమవరం నుంచి జిల్లా అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించిన ఆయన రైతాంగం ఎరువులు కోసం ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కన్నా ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించవలసిన అవసరం లేదని చెప్పారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపు చేసిన, అధిక ధరకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

=================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వార దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లను గత రెండు నెలలుగా చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీ ఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భక్తులకు ఈనెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. టోకెన్లు లేకుంటే తిరుమలకు రానివ్వరంటూ చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని కోరారు. జనవరి 2 నుంచి టోకెన్లు లేకున్నా దర్శనానికి అనుమతిస్తామని టీటీడీ ఛైర్మన్ స్పష్టం చేశారు.

=================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=================

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్ లో భాగంగా విశాఖపట్నం వేదికగా రెండవ టీ-20 క్రికెట్ మ్యాచ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. నగరంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. తొలి మ్యాచ్ లో విజయం సాధించిన హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఈ మ్యాచ్ లో కూడా విజయం సాధించాలని సిద్ధమవుతోంది.

=================

సంక్రాంతి పండుగ దృష్ట్యా ఆప్కో షో రూమ్ ల్లో భారీ డిస్కౌంట్ అమ్మకాలు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. 60, 50, 40 శాతాల డిస్కౌంట్ లపై చేనేత వస్త్రాలను విక్రయించనున్నామని, ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

=================
=================